క్లుప్తంగా

గోవులకు ఎండుగడ్డి సమర్పణ



గోవులకు ఎండుగడ్డి అందించిన సర్పంచ్ దంపతులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయంలోని గోశాలలో ఉన్న గోవులకు పలువురు దాతలు మంగళవారం ఎండు గడ్డిని సమర్పించారు. గోశాలలోని గోవులకు దాతలు ఎండుగడ్డి అందించాలంటూ దేవ స్థానం చేసిన అభ్యర్థనపై పలువురు దాతలు స్పందించారని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. పెదపట్నం సర్పంచ్ గుబ్బల దుర్గ, పండు దంపతులు ఒక ట్రాక్టరు ఎండుగడ్డిని అందించారని తెలిపారు. పి.గన్నవరం మండలం కె.ఏనుగుపల్లికి చెందిన సూదా వీరభద్రరావు, ఆయన మనవలు ఆయుష్, అయాన్స్ ఒక ట్రాక్టరు ఎండు గడ్డిని సమర్పించారన్నారు. ఏలూరు జిల్లా నిడమర్రు మండలం బావాయిపాలేనికి చెందిన బొబ్బిలి వెంకట సీతారామారావు, బొబ్బిలి ప్రసాద్ ఒక ట్రాక్టర్ గడ్డిని అందించారన్నారు. దాతలను ఆలయ ఈఓ అభినందించారు.

మహిళా విభాగం సమావేశానికి హాజరు



తాడేపల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రాజేశ్వరిదేవి

మామిడికుదురు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం సమావేశం మంగళవారం తాడేపల్లిలో జరిగింది. ఈ సమావేశంలో పి.గన్నవరం మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి పాల్గొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏ విధంగా విస్మరించిందో ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకు రావాలని సమావేశంలో సూచించారన్నారు. కూటమి వైఫల్యాలను గ్రామ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారని రాజేశ్వరిదేవి తెలిపారు.

భవన నిర్మాణ పనుల నిలుపుదల



శృంగవరప్పాడులో భవన నిర్మాణ పనులను నిలుపుదల చేసిన ఏసీ సత్యనారాయణ

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడులో మంగళవారం అంతర్వేది నీలకంఠేశ్వర స్వామివారి దేవస్థానానికి సంబంధించిన భూమిలో అనధికార నిర్మాణ పనులను అంతర్వేది దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ నిలుపుదల చేయించారు. అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానానికి నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ఉండడంతో ఏసీ సత్యనారాయణ ఈ చర్యలు తీసుకున్నారు. సర్వే నెం.124లో ఒక వ్యక్తి నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం చేపట్టినట్టు విషయం తెలుసుకుని, దేవదాయ శాఖ చట్టం, పై అధికారుల ఆదేశాలపై నిలుపుదల చేయించినట్టు ఆయన తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లపుఊట ధ్వంసం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద గోదావరి లంకలో సారా తయారీకి ఉపయోగించే 1000 లీటర్ల బెల్లపుఊటను ధ్వంసం చేసినట్టు కొత్తపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని తెలిపారు. అమలాపురం ఏఈఎస్ జి.అమర్‌బాబు, స్క్వాడ్ సీఐ ఎల్ చిరంజీవి, స్థానిక సీఐ కాత్యాయని పర్యవేక్షణలో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది నిర్వహించిన దాడుల్లో భాగంగా బొబ్బర్లంక సమీపంలోని లంక సారా తయారీకి సిద్ధంగా ఉంచిన పులిసిన బెల్లపుఊటను గుర్తించారు. ఇసుక దిబ్బల్లో పాతిపెట్టిన ఊట డ్రమ్ములను వెలికి తీసి ఊటను ధ్వంసం చేశారు. అదే మండలంలోని పేరవరం గ్రామానికి చెందిన 8 మంది వ్యక్తులు సారా కేసుల్లో నమోదవగా వారిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

పీహెచ్‌సీ వైద్యాధికారిగా దివ్యశ్రీ

అంబాజీపేట: ముక్కామల పీహెచ్‌సీ వైద్యాధికారిగా టి.దివ్యశ్రీ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం నూతనంగా నియమించడంతో ఇక్కడకు విధులకు హాజరయ్యారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎ.ఇంద్రావతి, జీవీ గీతాంజలి ఉన్నత చదువులకు వెళ్లిపోయారు.

ప్రభుత్వం గొప్పలు..
రైతుకు తిప్పలు

- ధాన్యం కొనడం లేదంటూ ఆందోళన
- కళ్లాల్లోనే ఉండిపోయిన ధాన్యం
- ప్రభుత్వ తీరుపై నిరసన

మామిడికుదురు: ప్రతి గింజ కొనుగోలు చేస్తామంటూ ప్రజా ప్రతినిధులు గొప్పలు చెబుతున్నారు. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లను నిలిపి వేయడంతో వేలాది బస్తాలు ధాన్యం గుట్టలు, రాశులుగా ఎక్కడికక్కడ కనిపిస్తోంది. దీనిపై రైతులు తీవ్ర స్థాయిలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దేశానికి రైతే రాజు, రైతే వెన్నెముక అని గొప్పలు చెప్పుకోవడం తప్ప తప్ప రైతులను ఏ విధంగాను ఆదుకోవడం లేదంటూ రైతులు తీవ్రంగా మండి పడుతున్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ మామిడికుదురులో రైతులు మంగళవారం ధర్నా చేశారు. తక్షణం ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తాము పండించిన పంట 50 శాతానికి పైగా ఉండిపోయిందని వాపోయారు. తమకు ఇచ్చిన టార్గెట్లు అయిపోయాయంటూ అధికారులు చేతులెత్తేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఆదుకోని పక్షంలో తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తామన్నారు.



మామిడికుదురులో ధర్నా చేస్తున్న రైతులు

రూ.300 తక్కువ ధరకు కొంటున్నారు



ప్రభుత్వం గిట్టుబాటు ధర అంటూ రూ.1725 ప్రకటించింది. బాగానే ఉంది. కానీ ధాన్యం కొంటేనే కదా రైతులకు గిట్టుబాటు ధర దక్కేది. బయట అమ్ముదామంటే గిట్టుబాటు ఉన్న రూ.300 తక్కువకు కొంటున్నారు. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మా ఇబ్బందులు తెలియడం లేదు. మరి ఏం చేస్తున్నట్లో అర్థం కావడం లేదు. వెంటనే మా నుంచి ధాన్యం కొనుకోలు చేసి మమ్మల్ని ఆదుకోవాలి.

– భూపతి వెంకటప్రసాద్, రైతు, మామిడికుదురు

20 రోజులుగా కళ్లంలోనే ధాన్యం



నేను 15 ఎకరాల్లో కౌలు వ్యవసాయం చేశాను. కోత కోసి కుప్ప నూర్చి 20 రోజులు కావస్తోంది. కానీ ఇంత వరకు ధాన్యం కొనే దిక్కు లేకుండా పోయింది. ఈ పరిస్థితి ఎందుకు వస్తుందో అర్థం కావడం లేదు. రైతులు పండించిన పంట కొనడం అంటే ఎందుకు అధికారులకు ఇంత చిన్న చూపో అర్థం కావడం లేదు. తక్షణం మేమే పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

– కోన రామకృష్ణారావు, రైతు, పెదపట్నం

200 బస్తాల ధాన్యం ఉంది



నేను ఐదెకరాల్లో 200 బస్తాలు ధాన్యం పండించాను. ఎంతో కష్టపడి పంట సాగు చేశాను. చివరి సమయంలో సాగునీటి సమస్య నుంచి బయట పడి పంట ఒబ్బిడి చేసుకున్నాం. కానీ గిట్టుబాటు ధరకు ధాన్యం అమ్ముదామంటే కొనే నాథుడు లేడు. స్థానిక అధికారులు చేతులెత్తేశారు. మేము చేయగలిగింది ఏమీ లేదని చెబుతున్నారు. మా సమస్యలు ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి.

– యనమదల రాజారావు, రైతు, మామిడికుదురు

పంచాయతీలకు గుదిబండగా..



రాజోలులో వశిష్ట గోదావరి గట్టున వేసిన చెత్త

- గోదావరి, కాలువ గట్లపైనే చెత్త డంపింగ్
- యార్డుల కోసం స్థల సేకరణకు ఆటంకాలు

రాజోలు: పారిశుధ్య నిర్వహణలో భాగంగా పంచాయతీలకు అవసరమైన సొంత డంపింగ్ యార్డులు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోజురోజుకూ గ్రామాల్లో పెరిగిపోతున్న చెత్తతో అనేక సమస్యలు ఎదురుకావడంతో పంచాయతీలకు చెత్త నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. అనేక పంచాయతీలను డంపింగ్ యార్డుల సమస్య పట్టి పీడిస్తోంది. సేకరించిన చెత్త తరలించేందుకు పలు గ్రామాల్లో చెత్త నుంచి సంపద కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొన్ని గ్రామాల్లో ఈ కేంద్రాలు అసంపూర్తిగా ఉన్నాయి. పంచాయతీలు చెత్తను వేసేందుకు స్థలాన్ని సొంతంగా కొనుగోలు చేసుకోవాలి లేదా ఏదైనా స్థలాన్ని లీజుకు తీసుకోవాలి. ప్రస్తుతం అటువంటి చర్యలు ఎక్కడా కనిపించడం లేదు. డంపింగ్ యార్డు సమస్య పంచాయతీలకు గుదిబండగా మారింది. చెత్త వేసేందుకు సరైన స్థలం లేకపోవడంతో గోదావరి, కాలువ గట్లు డంపింగ్ యార్డులుగా మార్చేశారు.

భూముల విలువ పెంపుతో..

రాజోలు నియోజకవర్గంలో మండల కేంద్రాలైన రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి పంచాయతీలకు చెత్త వేసేందుకు స్థలాలు లేకుండా పోయాయి. ప్రస్తుతం భూముల మార్కెట్ విలువ విపరీతంగా పెరిగిపోవడంతో డంపింగ్ యార్డు కోసం స్థలాలు కొనుగోలు చేసే పరిస్థితి కానరావడం లేదు. అలాగే మేజర్ పంచాయతీలైన తాటిపాక, పొన్నమండ, కడలి, గూడపల్లి, లక్కవరం, కేశనపల్లి, టేకిశెట్టిపాలెం, అంతర్వేదిపాలెం తదితర గ్రామాల్లో సేకరించిన చెత్తను వేసేందుకు స్థలాలు కరువయ్యాయి. ఎప్పటికప్పుడు సేకరించిన చెత్తను కాలువ గట్ల వెంబడి వేసి నిప్పుపెడుతున్నారు. రాజోలులో రోజుకు సుమారు ఐదు ట్రాక్టర్లకు పైగా చెత్తను వశిష్ఠ గోదావరి తీరంలో ఏటిగట్టు వెంబడి వేస్తున్నారు. దీనివల్ల పర్యావరణ కాలుష్యం తీవ్రమవుతోందని మత్స్యకారులు వాపోతున్నారు. తాటిపాక గ్రామంలో డంపింగ్ యార్డు సమస్య తీవ్రంగా ఉంది. పంచాయతీకి సమీపంలో చెత్త నుంచి సంపద కేంద్రం ఏర్పాటు చేసినా, డంపింగ్ యార్డు లేకపోవడంతో పలు సమస్యలు ఎదురవుతున్నాయి.

డ్రైన్లలో పూడికలు

లక్కవరం, మలికిపురం, చింతలపల్లి గ్రామాల్లో సేకరించిన చెత్తను స్థానిక డ్రైన్ల గట్ల వెంబడి వేస్తున్నారు. ఈ చెత్త కారణంగా డ్రైన్లు పూడుకుపోయి మురుగు నీరు, వర్షాకాలంలో ముంపునీరు దిగేందుకు తీవ్ర ఆటంకంగా మారుతున్నాయి. పంచాయతీలు సేకరించిన చెత్తను వేసేందుకు ప్రత్యేకంగా డంపింగ్ యార్డును ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. డంపింగ్ యార్డు కోసం గ్రామాల్లో స్థల సేకరణ చేయడం సమస్యగా మారిందని పంచాయతీ కార్యదర్శులు చెబుతున్నారు. పంచాయతీ పాలకవర్గ సమావేశాల్లో డంపింగ్ యార్డు సమస్యపై చర్చించి, నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



పెదపాలెంలో వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, కోఆర్డినేటర్లు శ్రీనివాసరావు, శ్రీకాంత్ తదితరులు

అయినవిల్లి: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం, అమలాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్లు గన్నవరపు శ్రీనివాసరావు, పినిపే శ్రీకాంత్ అన్నారు. అయినవిల్లి మండలంలోని ఎస్.పెదపాలెంలో వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌ను మంగళవారం చిర్ల జగ్గిరెడ్డి ప్రారంభించారు. తొలుత దివంగత మాజీ సీఎం వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబాజీపేట వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్ అధ్యక్షతన జరిగిన సభలో చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ దివంగత మాజీ సీఎం రాజశేఖరరెడ్డి క్రీడలకు ఎంతో ప్రాధాన్యం కల్పించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువత క్రీడలపై ఆకర్షితులు అవ్వడానికి ఆయన ఎంతో కృషి చేశారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ×ఆడుదాం ఆంధ్ర¶ పేరుతో గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో ఉత్సాహం పెంపొందించారన్నారు. వారిలో క్రీడల పట్ల ఆశక్తి పెరిగేలా షీల్డ్‌లు, బహుమతులు ప్రభుత్వం తరపున అందించారన్నారు. కోఆర్డినేటర్లు గన్నవరపు శ్రీనివాసరావు, శ్రీకాంత్‌లు మాట్లాడుతూ క్రీడల శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి దోహద పడతాయన్నారు. క్రీడలతో యువత ఎందార్పిన్లు విడుదలై నూతనోత్సాహం నింపుతుందన్నారు. అంబాజీపేట మండల యువత వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్ పేరుతో ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, వైఎస్సార్ సీపీ నాయకులు కుడుపూడి భరత్, చెల్లుబోయిన శ్రీను, పేరి కామేశ్వరరావు, వాసంశెట్టి తాతాజీ, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బుడిద వరలక్ష్మి, ఎంపీటీసీ సభ్యుడు రావూరి వెంకటరామారావు, మిండగుదిటి శిరీష్‌నారాయణస్వామి, దొమ్మేటి సత్యమోహన్, మేడిశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చలపతిరావుకు సన్మానం



డాక్టర్ చలపతిరావును సన్మానిస్తున్న శాస్త్రవేత్తలు, సిబ్బంది

అంబాజీపేట: అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు బదిలీపై వెళుతున్న సందర్భంగా స్థానిక శాస్త్రవేత్తలు, సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించారు. విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఉద్యాన సమాచార కేంద్రలో ప్రిన్సిపాల్ సైంటిస్టు హోదాతో పాటు ముఖ్య ప్రజా సంబంధ అధికారిగా (పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్) బదిలీపై వెళ్లనున్నారు. సీనియర్ శాస్త్రవేత్త ఈ నెల 18 వరకు సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు ప్రధాన శాస్త్రవేత్త, ఇన్‌చార్జి అధిపతిగా వ్యవహరించనున్నారు. 19న స్థానిక కొబ్బరి పరిశోధన కేంద్రానికి కర్నూలు జిల్లా నంద్యాలలోని మహానంది ఉద్యాన పరిశోధనా కేంద్రం నుంచి అక్కడి అధిపతి, ఉద్యాన ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ముత్యాల నాయుడు బదిలీపై ఇక్కడకు వచ్చి విధులకు హాజరు కానున్నారు.

వైభవంగా అమ్మవార్ల జాతర



నూకాలమ్మ, మహాలక్ష్మమ్మ

మామిడికుదురు: పెద పట్నంలంక, పాశర్ల పూడి గ్రామాల్లో కొలువైన గ్రామ దేవతల జాతర సోమవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. పెదపట్నంలంక గిడుగువారిపాలెం గ్రామ దేవత వనువులమ్మ జాతర మహోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు. పాశర్లపూడి గ్రామ దేవతలు నూకాలమ్మ, మహాలక్ష్మమ్మ వార్ల జాతర కూడా వైభవంగా జరిపించారు. చిత్ర, విచిత్ర వేషధారణలు, గరగ నృత్యాలు, తీన్‌మార్ విన్యాసాలు, పలు రకాల ఆధ్యాత్మిక కార్యక్రమాల నడుమ జాతర ఆద్యంతం కన్నుల పండువలా జరిపించారు. రెండు గ్రామాల్లోని అమ్మవార్లకు మంగళవారం నైవేద్యాలు చెల్లించారు. భారీ సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ముడుపులు, మొక్కులు చెల్లించారు.

అధిక ఉష్ణోగ్రతలపై జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో ప్రజలంతా బయటకు వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సీహెచ్‌ఓ బి.అప్పారావు అన్నారు. మాచవరం సచివాలయం–2లో ఓఆర్ఎస్ ప్యాకెట్లపై అవగాహన కార్యక్రమాన్ని, సచివాలయం–4లో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. అప్పారావు మాట్లాడుతూ వడగాడ్పులనకు గురైన ప్రతి ఒక్కరూ ఓఆర్ఎస్‌ను వినియోగిస్తే ఉపశమనం కలుగుతుందన్నారు. అనంతరం ఓఆర్ఎస్ ఉపయోగించే విధానాన్ని ప్రజలకు వివరించారు. సచివాలయం–4లో డాక్టర్ సూర్యనగేష్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఏలు డి.నాగేశ్వరరావు, వి.మురళీకృష్ణ, హెల్త్ అసిస్టెంట్ డి.నాగేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అద్దరి



రావులపాలెంలో నియోజకవర్గ కాపు ఉపాధ్యాయుల కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న సహచరులు

ఆలమూరు/రావులపాలెం: కొత్తపేట నియోజకవర్గ కాపు ఉపాధ్యాయ అసోసియేషన్ అధ్యక్షుడిగా మంగళవారం మండల కేంద్రమైన ఆలమూరుకు చెందిన అద్దరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. రావులపాలెంలోని శ్రీకృష్ణదేవరాయ కాపు కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గ కాపు సంఘ ఉపాధ్యాయుల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిక్కం మైనర్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేయగా నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న 78 మంది కాపు సామాజికవర్గానికి చెందిన ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ ఎన్నికల్లో సభ్యులంతా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అడపా శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శిగా అక్కిరెడ్డి సూర్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాపు సామాజిక వర్గంలోని పేద విద్యార్థుల అభ్యున్నతికి తమ వంతు సహకారం అందిస్తానని నూతన కార్యవర్గం హామీ ఇచ్చింది. నూతన కార్యవర్గాన్ని సభ్యులందరూ పూలమాలలు వేసి శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు.

వైభవంగా పళ్లాలమ్మ తీర్థమహోత్సవాలు



వానపల్లిలో పళ్లాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామ దేవత, ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల ప్రజల ఇలవేల్పు పళ్లాలమ్మ అమ్మవారి తీర్థ మహోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. నెల రోజుల పాటు జరిగే తీర్థ మహోత్సవాలకు దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు భక్తుల సౌకర్యార్థం వివిధ ఏర్పాట్లు చేశారు. సోమవారం తాళ్లు లేపి ఉయ్యాల మహోత్సవానికి శ్రీకారం చుట్టారు. స్థానిక యూనియన్ బ్యాంకులో ఉన్న అమ్మవారి బంగారం, వెండి ఆభరణాలను తీసుకువచ్చి అలంకరించారు. రాత్రి అమ్మవారి పెద్ద జాతర ఘనంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజామునుంచి అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించారు. దేవస్థానం తరపున పూజారులు మహాకుంభాభిషేకం జరిపారు. సాయంత్రం సిరిమాను ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. స్థానిక, స్థానికేతర ప్రాంతాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పలువురు ప్రముఖులు, అధికారులు, కోనసీమ ప్రాంతం నుంచే కాక ఇతర ప్రాంతాల నుంచి అత్యధికంగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. భక్తులందరికీ పులిహోర ప్రసాదం, మజ్జిగ సరఫరా చేశారు. పలు సేవా సంస్థలు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వానపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో కొత్తపేట ఎస్సై జి.సురేంద్ర బందోబస్తు నిర్వహించారు.

అనారోగ్య బాధితుడి వైద్యానికి సాయం



సాయం అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు మంగళవారం రూ.12,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. రామచంద్రపురానికి చెందిన పల్లి బాబినెహ్రూ (36). రెండు కిడ్నీలు పాడైపోయి కిడ్నీ మార్చుకోవాలని డాక్టర్లు చెప్పారు. తల్లి కిడ్నీ ఇవ్వడానికి ముందుకు రాగా ఆపరేషన్‌కి చాలా ఖర్చవుతుంది. అంత ఆర్థిక స్తోమత లేక దాతలను సహాయం కోరుతున్నారు. ఈ క్రమంలో స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. దీంతో రావులపాలెంలో బాబినెహ్రూ భార్య దుర్గాదేవికి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.12,500 చెక్కు అందజేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ కళాజాత



అయినవిల్లిలో కళాజాత నిర్వహిస్తున్న బృందం

అయినవిల్లి: జిల్లా ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు అయినవిల్లిలోని విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద ఎయిడ్స్ నివారణపై అవగాహన కల్పిస్తూ మంగళవారం కళాజాత నిర్వహించారు. ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తూ ఏర్పాటు చేసిన వీధినాటకం పలువురిని ఆకట్టుకుంది. ఎయిడ్స్ అనేక కుటుంబాలను అతలాకుతలం చేసిందని వివరించారు. ఎయిడ్స్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే కుష్ఠు, క్షయ వ్యాధుల పైన అవగాహన కల్పించారు. ఆర్ట్ కౌన్సిలర్ ప్రసన్న, పీఎం శ్రీనివాస్, ఎల్‌డబ్ల్యూఎస్ సిబ్బంది, చైల్డ్ ఫండ్ ఇండియా లింకు వర్కర్స్ పాల్గొన్నారు.

గూడపల్లి సర్పంచ్ బ్రహ్మయ్య మృతి

మలికిపురం: మండలంలోని గూడపల్లి సర్పంచ్ సుందర బ్రహ్మయ్య (తాతాజీ) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందాడు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. సోమవారం రాత్రి అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు తదితరులు తాతాజీ మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

హామీల అమలులో కూటమి విఫలం

మలికిపురం: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని పీసీసీ సభ్యుడు రుద్రరాజు గోపాల కృష్ణంరాజు విమర్శించారు. మంగళవారం ఆయన లక్కవరంలో విలేకరులతో మాట్లాడుతూ మహిళలకు సంవత్సరానికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తానని చెప్పి మొదట విడత సిలిండర్ తీసుకున్న వారికి రూ.822.38 పైసలు అకౌంట్‌కు జమ చేశారని ఆయన అన్నారు. కానీ రెండో విడత గ్యాస్ తీసుకున్న వారికి సుమారు రెండు నెలలు అయినా ఇప్పటివరకు సబ్సిడీ పడకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ గవర్నమెంట్ ఇచ్చే సబ్సిడీ రూ.10.62 పైసలు యథావిధిగా పడుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం రెండో విడత ఇచ్చే సబ్సిడీకి నిధులు వెంటనే మంజూరు చేసి మహిళా గ్యాస్ వినియోగదారులను ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరపున ఆయన డిమాండ్ చేశారు.

శృంగవరప్పాడులో సమస్యల పరిశీలన



శృంగవరప్పాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

సఖినేటిపల్లి: మండలంలోని శృంగవరప్పాడు గ్రామాన్ని మంగళవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సందర్శించారు. ఈ మేరకు అధికారులతో కలసి సమస్యలపై క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలన చేశారు. అనంతరం సర్పంచ్ రావి నాగవెంకట లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సమస్యలపై చేపట్టాల్సిన చర్యలను ఎమ్మెల్యే సమీక్షించారు. స్థానికులు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి తగిన కృషి చేయగలనని ఆయన హామీ ఇచ్చారు. తహసీల్దార్ ఎం.వెంకటేశ్వరరావు, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ యెనుముల కొండమ్మ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

హోమియోపతి ఆస్పత్రిలో వైద్యుల నియామకం



జొన్నాడలోని హోమియో వైద్యశాల

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో హోమియో ఆస్పత్రికి వైద్యుల నియామకం జరిగింది. గత కొన్నేళ్లుగా స్థానిక ఆస్పత్రిలో వైద్యుల నియామకం లేకపోవడంతో వైద్య సేవలను నిలిచిపోయాయి. దీనిపై స్పందించిన గ్రామస్తులు పలుమార్లు ప్రజాప్రతినిధులు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఆస్పత్రి ఆవశ్యకతన వివరించారు. దీంతో హోమియో వైద్యులుగా మిథున్, రవి రాజశేఖర్‌ను నియమిస్తూ జిల్లా వైద్యారోగ్యశాఖ ఉత్తర్వులను వెలువరించింది. టీడీపీ నేత తాడి శ్రీనివాసరెడ్డి తమ వంతు సాయంగా రూ.10 వేలుతో మందులు కొనుగోలు చేసి ఆస్పత్రికి అందజేశారు.